
# అప్పారావు కథ




ఆ విధంగా అప్పారావుకి బాకీ తీర్చే సత్తా ఉందో లేదో కనుక్కొస్తానని త్మ కుమారుడు గుర్నాధం కదలగానే, మనసబుగారుకూడా లేచి ఆగరా అబ్బీ నేనూ వస్తా, అటేపే పనుంది, అంటూ వెంట బయల్దేరారు.

ఈ విధంగా వారు వెళ్తూండగా గజ్జెలగుర్రం వంటి ఓ చిన్నది కడవ చంకనబెట్టినది వయ్యారంగాపోతూ ఎదురయ్యేవరకు, అదృష్టవశాత్తు గుర్నాధానికి ఎరిగిన మనిషొకడు తటస్థపడగా, నువ్వు పద నాన్నా అంటూ ఒక్కడుగు ఆగాడు గుర్నాధం. ఈలోగా నాలుగడుగులు ముందుకువేసి వీధి మలుపు తిరిగి శివాలయం చేరబోయేసరికి మునసబుగారికి సుబ్బారావు అని ఒక ఋణగ్రహీత కనపించాడు. అతడు ఆయనకు ఐదొందలు ఇవ్వాలి. నిన్ననో మొన్ననో జ్మ పెడతానన్నాడు. సరే ఇతగాడిస్తే, తను సుపుత్రుడి మిత్రుడికి ఈ పైకం ఇలాగే ఫిరాయించేయొచ్చునని ముచ్చట పడి మునసబుగారు అతని దరి చేరబోయారు.

వారిని చూడగానే అప్పారావునకు గుండె గుభేలుమంది. అయితే అతను ఉపాయాలపుట్ట కాబట్టి, కర్తవ్యాలు ఎరిగినవాడు కాబట్టి ఆ దారినే బడికిపోతున్న పిల్లల్ని చూసి అందులో ఒకణ్ణి ఆప్యాయంగా ఎత్తుకు ముద్దాడబోయాడు. వాడు మావాడు కాదు అన్నారు మునసబుగారు చిరునవ్వు నవ్వి.

అప్పారావు ఆ పిల్లాణ్ని పడేసి మందలో ఇంకోణ్ని ఎత్తుకుని ముద్దాడి ఆయనవంక చూశాడు.

వీడూకాదు అన్నాయి మునసబుగారి చూపులు. వెంటనే అప్పారావు వాణ్ని పారేసి ఇంకోణ్నితీసి, ముద్దాడే ముందు ప్రశ్నార్థకంగా చూశాడు.

వద్దు అన్నాయి మునసబుగారి చూపులు.

అప్పారావు కంగారుగా ఇంకో పిల్లడిని ఏరి ఎత్తుకోబోగా నాకు ఆ వయసు చిన్నపిల్లలు లేరు అన్నాడు మునసబుగారు నవ్వి.

చిత్తం ఏ వయసులో ఉంటారండి సుమారు అన్నాడు అప్పారావు వినయం నటించి.

పాతికేళ్ళు.

అబ్బా! చాలా బరువుంటాడండి? అన్నాడు అప్పారావు బిక్కమొహంతో.

నీకన్న ఫరవాలేదు. వెధవాయి తిండి సరిలేక అలా వున్నాడు కాని మా వంశంలో వాడే అర్భకుడు. అయినా నివ్విప్పుడు వాణ్ణెత్తుకోడం నా కిష్టంలేదు. నేనొప్పుకున్నా వాడికి ఇష్టం ఉండదు. వాడి పెళ్ళాం నవ్వుతుందని భయం అన్నారు మునసబుగారు పుసుక్కున నవ్వి.

అప్పారావు ఫెళ ఫెళ నవ్వేసి, విరగబడిలేచి, భలేవారండి మీరు. జెంతసరసులూ! చూట్టానికల్లా వున్నారు కాని అని ముడేసుకుపోయాడు.

అది సర్లేకాని సుబ్బారావూ మూన్నాళ్ళ క్రితమే పైకం జమచేస్తా నన్నావూ ఇదేమన్నా బాగుందా అన్నారు మునసబుగారు.

మరేండి ఏంబావుంది, మహా ఏడిసినట్టుంది. చాలా తప్పుకాదూ? అమాటే నేను మా జతగాడికి చెబుతున్నా. ఒరేయ్ అవతల పెద్దమనిషితో మాటరోయ్, మరొకటి కాదురోయ్ డబ్బుయిచ్చితీరాలి అని చీవాట్లేస్తున్నా. ఈ పూట తప్పకుండా యిస్తానన్నాడు. రాగానే మీకు ఫిరాయించేస్తా అన్నాడప్పారావు.

నేనేనా దాన్ని పాతరేసి దాచబొయ్యేది లేదు. నువ్విలా ఇచ్చావో నేనలామరొకరికి ఫిరాయించేస్తే మా పిల్లడి జతగాడికి పాపం అర్జెంటుగా కావాలిట అన్నాడు మునసబుగారు.

అప్పారావు గుండె రంగున ఆగిపోయింది. అంతలో అల్లంత దూరాన గుర్నాథాన్ని చూడగానే మళ్ళీ గబగబ కొట్టుకుంది.

సుబ్బారావూ–వాడేనోయ్ మా పిల్లడూ అన్నాడు మునసబుగారు.

చిత్తం వాడే మా జతగాడు అన్నాడు అప్పారావు.

హల్లో అప్పారావు, సారీ లేటయింది అన్నాడు గుర్నాథం. వేళ కొచ్చావురా అన్నాడు అప్పారావు.

నీ పేరు సుబ్బారావు గాదటోయ్ అన్నాడు మునసబుగా రనుమానంగా.

అప్పారావు చెడ్డ బటాణీ నమిలిన వేదాంతిలా నవ్వి వాటీజినేమ్ నేమ్ సార్. పేరులోనేముంది? అన్నాడు వినయంగా.

పదినిమిషాలు కిందా మీదా పడ్డాక మునసబుగారు ఫెళ ఫెళ నవ్వి భలేవాడివయ్యా! నీకు నిజంగా ఐదొందలూ వూరికే యిచ్చినా తప్పులేదు అన్నాడు.

చిత్తం మి దయ. గుర్నాధం! నువ్విస్తానన్నా ఐదొందలిస్తే, మీ నాన్నగారికి బాకీ తీర్చేస్తాను మరి. పెద్దమనిషితో మాటా మరోటా అన్నాడు.

ఇంక మళ్ళీ వాడు ఇచ్చేదేముందిలే. వాడిచ్చినట్టేననుకో అన్నారు మునసబుగారు.

చిత్తం. అయితే వీడిచ్చింది మీకు నేనిచ్చినట్టనుకోండి. ముందర మీ బాకీ ఫయిసలయిందిగదా. అమ్మయ్యా గుండెలమీద రాయి దిగినట్టయింది. ఆదేవిటో ఆ రాయిలేకపోతే నాకు నిద్రపట్టదు అన్నాడు అప్పారావు.

రాస్కెల్ మా నాన్నకే వేశావే టోపీ. నాకు తెలీకుండా మానాన్న దగ్గిర ఎలా పుచ్చుకున్నావూ అన్నాడు గుర్నాధం.

బావుంది నీకు తెలీకుండా నీ దగ్గిర తీసుకోగాలేంది మీ నాన్న దగ్గిర తీసుకోవడం విశేషమా. నీ కసలు నిర్వాకం తెలీదు.

అలా చెప్పునాయనా అన్నారు మునసబుగారు.

చెబుతానండి ఇంకా బోల్డు చెబుతానుగాని మీరిందాక మాటన్నారు చూడండి ... అదే ఐదొందలు ఊరికే ఇచ్చినా ఫరవాలేదనలే? అది

ఇచ్చేస్తే బాగుంటుంది. ఆడిన మాట తప్పనివారు. పైగా శివాలయంపైన అష్టదేవతలూ సాక్షులు. అనవసరంగా ఋణానపడి ఇదవడం మంచిది కాదు, అన్నాడు అప్పారావు.

ఏడిశావు. బోడితెలివీ నువ్వూను అనబోయాడు గుర్నాధం.

కుర్రాడు మంచి చమత్కారి. ఉండాల్సినవాడు. అలాగేలేవయ్యా నాలుగురోజులు ఆగు. చేతికి డబ్బురాగానే నీ బాకీ జమకడతాను అన్నారు మునసబుగారు.

చిత్తం నేను ఎల్లుండి ఊరికెళ్తున్నాను. ఈ లోగా ఇచ్చెయ్యండి. ఒకవేళ డబ్బు రెడీకాపోతే కరణంగారు నన్నెరుగుదురు. వారితో చెప్పి సర్దమంటాను. తరువాత మిరూ మీరూ చూసుకొందురుగాని ......... బైది బై గుర్నాధం! మీ నాన్నగారు ఐదొందలు ఇవ్వగానే మళ్ళీ నీటి నీకిస్తాగాని ఓ అర్ధణా డబ్బులిలా పారెయ్! శోషొస్తోంది సోడా తాగాలి.

అంటూ కథ ముగించాడు చీమల సింహాద్రి. కాబట్టి ఓ సుబ్బన్నా

## వారేవీరు లేక పరివర్తనము

అంటూ హఠాత్తుగా నేలమీద డేగ నీడ కనబడేసరికి గబుక్కున పుట్టలో దూరిపోయాడు సింహాద్రి.

ఉత్తర క్షణంలో, ఇదేమిటీ ! చీమకి డేగలంటే భయమేల అనుకుని, తన శరీరం చూసుకుని గతుక్కుమన్నాడు.

చుట్టూ చూసి ఇంకా గతుక్కుమన్నాడు. హడలిపోయాడు. గజ గజ వణికిపోయాడు

మెల్లిగా పడగెత్తి పుట్ట అవతలికి తొంగిచూశాడు. డేగ, పైన చక్రాలు తిరిగి తిరిగి ఒక్కసారి రివ్వున, సుబ్బన్నా నాగలక్ష్మి అంతకు ముందు దాగిన పొదమీదకు దిగి దాన్ని చికాకు పరిచి వెతికి తెల్లబోయి చిన్నబుచ్చుకుని, నవ్వుకుని అటూ ఇటూ చూసి ఎవరూ తన పరాభవం చూడలేదని ధైర్యం తెచ్చుకుని ఎగిరిపోయింది.

ఓ నిముషం తరువాత సుబ్బన్న, నాగలక్ష్మి పొద ఇవతలికి వచ్చారు.

పుట్టలోంచి సింహాద్రీ, అతని బలగం కూడా బయటపడ్డారు బిల బిల్లాడుతూ.

ఇదేమిటీ వింత? అన్నాడు సుబ్బన్న.

సింహాద్రి చుట్టూ చూశాడు. తనకళ్ళను తానే నమ్మలేక తనూ తన తోటి లక్షలాది చీమలూ పాములుగా మారిపోవడం జరిగింది.

అంతవరకు వూహా పొగరుగా బుసలుకొడుతున్న సుబ్బన్నా నాగ లక్ష్మి నేలకంటుకుని ఉన్నారు. వాళ్ళిద్దరూ చీమలు అయిపోయారు.

నా కర్థం కాలేదు అన్నాడు సుబ్బన్న.

ఏముందీ ఆర్నెల్లు స్నేహంచేస్తే వారు వీరవుతారు అన్నాడు సింహాద్రి తమాషాగా నవ్వి. అతను తన పడగా అదీ చూసుకు మురిసి పోతున్నాడు.

ఇపుడు మీరంతా పాములు. ఇన్ని లక్షలమందికి ఒక పుట్ట ఎలాగా చాలదుగదా అంది నాగలక్ష్మి ఆశగా.

మీరిద్దరే చీమలు. మీకు ఇంత పెద్ద పుట్టెందుకు బాపురుమంటూను. నిశిరాత్రివేళ మెళుకువస్తే ఝడుసుకుంటారు కూడాను అన్నాడు సింహాద్రి.

నాగలక్ష్మి ఓ నిమిషం ఆలోచించి, భయపడితే పడతాంగాని, ఆ పుట్ట మాకు అప్పివ్వండి. ఎంతసేపు, ఇట్టె నిండుతుంది లెండి అంది.

అప్పా? అన్నాడు సింహాద్రి పకపక నవ్వి. మళ్ళీ అదేంమాట. ఇందాకేగా మీ ఆయన అప్పులు అడగరాదూ ఇవ్వరాదూ అని నీతి కథలతో ప్రపంచతంత్రం బోధపరచా ననుకున్నాడు? మళ్ళీ ప్లేటు ఫిరాయిస్తారా ?

జన్మలూ శాస్త్రీలూ ఫిరాయించగా లేంది ప్లేటు ఫిరాయించడానికి ఏముంది...అదీగాక, ఆర్నెల్లు స్నేహమైతే వారు వీరవుతారని మీరే అన్నారుగా. మళ్ళీ బేరాలాడదాం ఆర్నెల్లపాటు. అపుడు మళ్ళీ మీరు మేమూ, మేము మీరూ మోరు మారూ మెరుమూరూ మూము మేమూ మూమె మేమే...

అఋణకిరణుడు నవ్వుకుని కొండచాటుకి పోగానే ఋణకిరణుడు ఇవతలికివచ్చి ప్రతాపం వెలిగిస్తున్నాడు. మళ్ళీ అప్పిచ్చినవాడొచ్చి మండి పడేవరకూ నిశ్చింత.

సూర్యుడు సముద్రుడి దగ్గిర అప్పు తీసుకుంటున్నాడు. ఆయన దగ్గరనుండి భూమి అప్పు తీసుకుంటోంది. దాన్ని సముద్రుడు వడేసు కుంటున్నాడు; మళ్ళీ పై వాడికి అప్పులిస్తున్నాడు.

ఋణభ్రమణం దాఋణంగా సాగిపోతోంది.